సాక్షి
ములుగు

గురువారం । 23 । నవంబర్ । 2023

ఓటు భద్రంగానే..!
- అక్రమాన్ని అడ్డుకునేందుకు 'చాలెంజ్ ఓటు'
- ఓటు గల్లంతైతే 'టెండర్ ఓటు'కు అవకాశం
- ఎన్నికల కమిషన్ వెనులుబాటు

- వివరాలు 10లో▸



కాకతీయుల చరిత్ర తెలుసుకోవాలి
విద్యార్థి దశ నుంచే చారిత్రక కట్టడాలను పరిరక్షిస్తూ, కాకతీయుల చరిత్ర తెలుసుకోవాలని పురావస్తుశాఖ అధికారి మల్లేశం తెలిపారు.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
29.0^{0} / 22.0^{0}

వాతావరణం
జిల్లాలో ఉదయం చలి, రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత మామూలుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇండియా కరాటే కోచ్‌గా అబ్బు



ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన ఎండీ అబ్బు కరాటే మాస్టర్ ఇండియా కరాటే టీంకు కోచ్‌గా ఎంపిక చేసినట్లు ఇండియా కరాటే అకాడమి పునకోషి కో ఆర్డినేటర్ గణేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు కజకిస్తాన్ రాజధాని ఆస్తానాలో జరగనున్న ప్రపంచ స్థాయి కరాటే పోటీలకు టీమ్ కోచ్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు. 35 సంవత్సరాల పాటు కరాటే శిక్షణలో అనుభవం కలిగి ఉన్న ఆయన ఎంతో మందిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేరుకునేలా చేశారని వివరించారు. ఈ సందర్భంగా ఇండియా కరాటే కోచ్‌గా ఎంపిక చేసినందుకు అసోసియేషన్ పునకోషి కరాటే అకాడమి ఇండియా కోఆర్డినేటర్ గణేష్‌కు అబ్బు కృతజ్ఞతలు తెలిపారు.

శబరిమల యాత్రకు ఆర్టీసీ బస్సులు

ఏటూరునాగారం: శబరిమల యాత్రకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్లు వరంగల్ 2 డిపో మేనేజర్ సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 36 సీట్లు ఉన్న సూపర్ లగ్జరీ, 40సీట్ల డిలక్స్, 49 సీట్ల ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాలధారులను శబరిమలకు అనూకూలమైన రూట్లలో చేర్చేందుకు బస్సు సర్వీసులను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ బస్సులో గురుస్వామికి ఉచిత ప్రయాణంతో పాటు అదనంగా ఐదుగురు(ఇద్దరు వంటవాళ్లు, సహాయకుడు), ఇద్దరు మణికంఠలకు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. అనుభవం ఉన్న డ్రైవర్లతో శబరిమల ప్రయాణం సాగుతుందని తెలిపారు. సూపర్ లగ్జరీకి సీటింగ్ సంఖ్యకు అనుగుణంగా ఒక్కో కిలోమీటరు కు రూ.65, డీలక్స్ 40 సీట్ల కెపాసిటీ గల బస్సుకు కిలోమీటరుకు రూ.65లు, ఎక్స్‌ప్రెస్ 50 సీట్ల కెపాసిటీ గల బస్సుకు రూ. 69లు కిలోమీటర్‌కు ధర నిర్ణయించినట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9959226048లో సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ములుగు రూరల్: జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు జాకారం గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని రీజినల్ కో ఆర్డినేటర్ విద్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 19న మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదురులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జాకారం గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్ 14 విభాగంలో రాజ్‌కుమార్, అండర్ 17విభాగంలో సిద్ధార్థ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాజ్‌కుమార్ 2024లో ఢిల్లీలో జరగబోయే పోటీలకు, సిద్ధార్థ డిసెంబర్‌లో బీహార్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పీడీ రవి, పీఈటీ భాస్కర్, ప్రిన్సిపాల్ యాదగిరి, ఉపాధ్యాయులు పిచ్చిరెడ్డి, శ్రీధర్ రావు, సురేష్, సత్యం పాల్గొన్నారు.

నాగజ్యోతిని గెలిపిస్తేనే సమగ్రాభివృద్ధి



ములుగు: బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతిని గెలిపిస్తేనే ములుగు సమగ్రాభివృద్ధి చెందుతుందని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాష్ అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఓడిపోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. అయినప్పటికీ సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో నిధులు కేటాయించారన్నారు. రాష్ట్రంలో 50శాతం కంటే ఎక్కువ మంది యువత బీఆర్‌ఎస్‌తోనే ఉన్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. వారి మాయమాటలు నమ్మకుండా బడే నాగజ్యోతిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, సీనియర్ నాయకుడు అజ్మీరా ధరం సింగ్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కోగిల మహేష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపై నిఘా





ఏటూరునాగారం మండల పరిధిలోని మల్యాలలో సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రం

నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వివరాలు

మండలం	సంఖ్య	సమస్యాత్మకం..	వెబ్, సీసీ కెమెరాలు
ములుగు	59	0	30
వెంకటాపురం(ఎం)	40	0	11
గోవిందరావుపేట	35	1	21
తాడ్వాయి	26	6	18
ఏటూరునాగారం	28	4	15
కన్నాయిగూడెం	14	3	11
మంగపేట	46	0	27
కొత్తగూడ	38	10	13
గంగారం	16	10	6
మొత్తం	302	34	152

ఏజెన్సీలో 34 సమస్యాత్మక ప్రాంతాలు
- వెబ్ కాస్టింగ్‌కు ప్రత్యేక చర్యలు
- నో నెట్ వర్క్ ప్రాంతాలపై నజర్

ఏటూరునాగారం: ములుగు నియోజకవర్గంలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు, ఎలాంటి సమాచారం అందని అటవీ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ గుర్తించింది. నియోజకవర్గంలో 302 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 34 సమస్యాత్మకమైనవిగా అధికారులు గుర్తించారు. అక్కడి నుంచి ఎలాంటి సమాచారం వచ్చే పరిస్థితి లేదు. దీంతో అక్కడ జరిగే పోలింగ్ విధానాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాలను పోలింగ్ కేంద్రాల్లో అమర్చనున్నారు. పోలింగ్ ఉదయం 7 నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిపేందుకు ఉన్నతాధికారులు పోలింగ్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ ప్రదేశాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పూర్తి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఓటింగ్ విధానాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి ఆయా కేంద్రాలకు పలు సూచనలు, సలహాలు చేయడానికి కేంద్రాల్లో సీసీ కెమెరాలు వెబ్‌కాస్టింగ్ పద్ధతిలో ఏర్పాటు చేయనున్నారు. ముందుగానే సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. గతంలో 1990లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏటూరునాగారం మండల పరిధిలోని చెల్పాక పోలింగ్ బూత్‌ల నుంచి బ్యాలెట్ బాక్సులను ఏటూరునా గారం తీసుకువస్తుండగా మావోయిస్టులు మందుపాతర్లను చెల్పాక-రొయ్యూరు మధ్య అటవీ ప్రాంతంలో అమర్చి పోలీసుల వాహనాలను పేల్చివేశారు. ఈ ఘటనలో సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై కిశోర్‌కుమార్‌తో పాటు 8 మంది పోలీసులు మృత్యువాత పడ్డారు. అప్పటి నుంచి జిల్లాలోని మారుమూల ప్రాంతాలను సమస్యాత్మకమైన కేంద్రాలుగా ప్రకటించి పోలింగ్ కేంద్రాలపై నిఘా పెంచారు.

7గంటలకు మాక్ పోలింగ్

ఉదయం 5.30 గంటలకు బ్యాలెట్ బాక్సులు, ఏజెంట్లు, సిబ్బంది అన్ని సిద్ధం చేసుకొని ఉండాలి. 7గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించి 50 ఓట్లు పడే వరకు సరిచేసుకోవాలి. ఈవీఎంలు అమర్చడంతో పాటు స్క్రీనింగ్ కనిపించడం, విద్యుత్ సరఫరా వంటివి అమర్చుకోవాలి. సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ సరళి ముగియనుంది.

100 మీటర్ల వరకు 144 సెక్షన్

పోలింగ్ కేంద్రం నుంచి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఏ రాజకీయ పార్టీ కూడా ప్రచారం, అల్లర్లు వంటివి చేయకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టనున్నారు. అంతేకాకుండా ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వారిని వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకుంటారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి



వీసీలో పాల్గొన్న ఇలా త్రిపాఠి, అంకిత్

ములుగు: నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఇతరత్రా సిబ్బందికి ఇస్తున్న శిక్షణ పూర్తి అయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ తరఫున ఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ ఎన్నికల ఏర్పాట్లపై బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు రిటర్నింగ్ అధికారి, ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ అంకిత్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నియోజకవర్గంలో 2,26,236 మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటి వరకు 1,86,013 మంది ఓటర్లకు ఓటరు స్లిప్పులను అందించామని తెలిపారు. మిగతా ఓటర్లకు ఎన్నికల లోపు స్లిప్పులు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈవీఎం మిషన్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. 24వ తేదీ వరకు కమిషనింగ్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటికే 80 శాతం ఓటరు గుర్తింపు కార్డులు సైతం పంపిణీ చేశామని తెలిపారు.

ఇంటి నుంచి 152 మంది ఓటు

నియోజకవర్గంలోని 9 మండలాల్లో 152 మంది దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పించామని జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం వరకు 125 మంది తమతమ ఓటు హక్కును బ్యాలెట్ పేపర్ ద్వారా వినియోగించుకున్నారని తెలిపారు. ఇంటి వద్ద నుంచి ఓటు వేసే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, పోలీసులు, బూత్ లెవల్ సిబ్బంది సమక్షంలో ఓటు వేసే ప్రక్రియను కొనసాగిస్తున్నామన్నారు. ఓటు వేయని వారికి ఈ నెల 25వ తేదీ వరకు ఫారం డీ ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి జయదేవ్

గోవిందరావుపేట: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ అన్నారు. మండల పరిధిలోని చల్వాయిలో గల జెడ్పీహెచ్‌ఎస్‌లో నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం 'ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం' అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి సైన్స్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. దీంతో పాటు విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, శోధించే ఆలోచనలు పెరుగుతాయని వివరించారు. పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు విద్యార్థులను సైన్స్‌పై మక్కువ పెంచుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సైన్స్ కార్యక్రమాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఎంఈఓ దివాకర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే సైన్స్ పై అవగాహన పెంచుకుని నూతన ఆవిష్కరణలు తయారు చేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా బిట్స్, సాధన, సన్‌రైజ్ పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు డిసెంబర్ 2న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సోమరెడ్డి, రహీం మహ్మద్, మల్లారెడ్డి, నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ అకాడమిక్ కో ఆర్డినేటర్ రాజేష్, డీసీఇబీ సహాయ కార్యదర్శి విక్రంరాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క చాన్స్ ఇవ్వండి..



సభలో ప్రసంగిస్తున్న ఈటల రాజేందర్



హాజరైన ప్రజలు, కార్యకర్తలు

- మాజీ మంత్రి చందూలాల్ కుమారుడు ప్రహ్లాద్‌ను ఆశీర్వదించండి
- బీజేపీ బహిరంగ సభలో ఈటల రాజేందర్

ములుగు: గతంలో టీడీపీ, కాంగ్రెస్ పార్టీలను గెలిపించారు.. ఈ ఒక్క సారి చాన్స్ ఇచ్చి బీజేపీని గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని హుజురాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. ములుగు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి డాక్టర్ అజ్మీరా ప్రహ్లాద్‌కు మద్దతుగా జిల్లా కేంద్రంలోని సాధన హై స్కూల్ పక్కన బుధవారం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ములుగుపై ప్రేమతో ప్రధానమంత్రి మోదీ ములుగు మండలంలో గిరిజన యూనివర్సిటీ, వెంకటాపురం(ఎం) మండల పరిధిలోని రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు వచ్చేలా చేశాడని తెలిపారు. ములుగు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా మాజీ మంత్రి దివంగత అజ్మీరా చందూలాల్ చేపట్టిన అభివృద్ధే కనిపిస్తుందన్నారు. ఆయన తనయుడు బీజేపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన ప్రహ్లాద్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే పెండింగ్‌లో ఉన్న పనులను ఆరు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. 40ఏళ్లుగా చందూలాల్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఊహించని విధంగా మేనిఫెస్టో విడుదల చేశామన్నారు. వరి ధాన్యం క్వింటాకు రూ.3,100 మద్దతు ధరతో కొనుగోలు చేస్తామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్క కుటుంబానికి సంవత్సరానికి నాలుగు గ్యాస్ సిలిండర్లు అందిస్తామని తెలిపారు. వైద్యానికి గానూ ఆయుష్మాన్ భారత్ పథకం కింద రూ. 10లక్షలతో ఉచిత వైద్యం అందిచడంతో పాటు సరిపోకపోతే సీఎం రిలీఫ్ ఫండ్ కింద మిగతా డబ్బులు అందేలా చూస్తామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హామీ ఇచ్చారని వివరించారు. మహిళా సంఘాలకు అందాల్సిన రూ.4,250 వేల కోట్ల వడ్డీ డబ్బులను అందిస్తామని వివరించారు. అధికారంలోకి రాగానే 1200 బస్సులతో ఆర్టీసీని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు మంగపేట మండలంలోని రాజుపేటను మండలంగా ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు మాట్లాడుతూ ప్రజలు ఒక్కసారి ఆలోచించి బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే భవిష్యత్ బాగుంటుందన్నారు. తాను పుట్టింది నర్సంపేటలో అయినా గరికపాటి అంటే ములుగు వాసి అంటారని తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ అజ్మీరా ప్రహ్లాద్ మాట్లాడుతూ రెండు సార్లు గెలిచి సీతక్క నియోజకవర్గానికి ఏం చేయలేదన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ దుష్ప్రచారాలను ప్రజలు నమ్మకూడదన్నారు. తనను ఆశీర్వదించి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు నరహరి వేణుగోపాల్, మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి, అజ్మీరా కృష్ణవేణి నాయక్, వెంకట్‌నారాయణరెడ్డి, దేవేందర్ రావు, భూక్య రాజునాయక్, గుగులోత్ స్వరూప్, పోరిక ఉత్తమ్‌కుమార్, ఉషాకిరణ్, భిక్షపతి, రవీందర్‌రెడ్డి, నగరపు రమేష్, సురేందర్, కృష్ణ, మహేందర్, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న టీం సభ్యులు

ములుగురూరల్: గిరిజన పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధించాలని ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ప్యానల్ టీం హెడ్ కె. శ్రీనివాస్ అన్నారు. ఐటీడీఏ పీఓ అంకిత్, డీడీ పోచం ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని జగ్గన్నపేట పాఠశాలలో ప్యానెల్ టీంకు చెందిన 10 మంది సభ్యులు ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ నిర్వహణ, హెల్త్, హైజానిక్, గేమ్స్, స్పోర్ట్స్, అథ్లెటిక్స్, లైబ్రరీ, భవన సముదాయాలను, అకౌంట్స్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఏ గ్రేడ్ కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మయ్య, బుచ్చయ్య, లక్ష్మీనారాయణ, యాకమ్మ, అశోక్, నారాయణ, విజయలలిత, పాఠశాల హెడ్మాస్టర్ వేణుగోపాల్, లక్ష్మి, రమాదేవి, బన్సిలాల్, పరంసింగ్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఐదు చోట్ల ఓట్ల లెక్కింపు!

ఉమ్మడి జిల్లాలో కేంద్రాలు ఖరారు
- ఏనుమాములలో 5 అసెంబ్లీ స్థానాలవి లెక్కింపు
- ములుగు, భూపాలపల్లి, జనగామ, మానుకోట ఎక్కడివక్కడే
- డిసెంబర్ 3న కౌంటింగ్‌కు కసరత్తు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పోటీ చేస్తున్న అభ్యర్థులు	కౌంటింగ్ కేంద్రం
జనగామ	277	19	విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీ, పెంబర్తి, జనగామ
స్టేషన్ ఘన్‌పూర్	290	19	విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీ, పెంబర్తి, జనగామ
పాలకుర్తి	294	15	విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీ, పెంబర్తి, జనగామ
డోర్నకల్	256	14	సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, మహబూబాబాద్
మహబూబాబాద్	283	12	సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, మహబూబాబాద్
నర్సంపేట	283	16	గోడౌన్ నం 17/ఏ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
పరకాల	239	28	గోడౌన్ నం 4/సీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
వరంగల్ పశ్చిమ	245	15	గోడౌన్ నం 4/డీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
వరంగల్ తూర్పు	230	29	గోడౌన్ నం 17/బీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
వర్ధన్నపేట	278	14	గోడౌన్ నం 17/సీ, ఏనుమాముల మార్కెట్, వరంగల్
భూపాలపల్లి	317	23	సీఈఆర్ క్లబ్, అంబేడ్కర్ స్టేడియం, భూపాలపల్లి
ములుగు	303	11	జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మీటింగ్ హాల్‌లో

హన్మకొండ అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో శాసనసభ ఎన్నికలను పటిష్టంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ప్రచార గడువు దగ్గర పడుతుండడంతో ఒక వైపు పోలింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం అంతే వేగంగా కౌంటింగ్ కోసం కసరత్తు మొదలు పెట్టింది. ఇప్పటికే రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని మొత్తం 12అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 30 పోలింగ్ జరగనుంది. వీటి ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3న జరగనుంది. ఇందు కోసం ఉమ్మడి జిల్లాలో మొత్తం ఐదు లెక్కింపు కేంద్రాలను గుర్తించారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటికే ఏర్పాట్లు మొదలు పెట్టారు. గతంలో వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డులోనే లెక్కింపు చేసిన అధికారులు ప్రస్తుతం జిల్లాల వారీగా విభజించారు. ఏనుమాముల మార్కెట్‌లో వరంగల్ పశ్చిమ, తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల (ఐదు) నియోజక వర్గాల ఓట్లు లెక్కించనున్నారు. అదేవిధంగా జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజక వర్గాల ఓట్లు జనగామ జిల్లా పెంబర్తిలోని విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీలో చేపట్టనున్నారు. డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల ఓట్లు మహబూబాబాద్ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో, భూపాలపల్లివి అక్కడి వీసీఈఆర్ క్లబ్‌లో, ములుగు ఓట్లు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో గల మీటింగ్ హాల్లో లెక్కించాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా కేంద్రాలను గుర్తిస్తూ జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఆయా జిల్లాల జిల్లాల ఎన్నికల అధికారులు, ఆర్‌ఓలు ఏర్పాట్లు చేస్తున్నారు.



స్ట్రాంగ్ రూంలో ఈవీఎంను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా

ఏర్పాట్లు మొదలు..

ఐదు నియోజక వర్గాలకు సంబంధించి కౌంటింగ్ నిర్వహించే హాల్స్‌లో 24గంటల పాటు కరెంట్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అత్యవసరాల కోసం జనరేటర్లు అందుబాటులోకి తెచ్చారు. పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించిన ఈవీఎంల వద్ద సాయుధ బలగాలతో మూడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా సీసీ కెమెరాలు తాగునీరు, లైటింగ్ బారికేడ్లు, టాయిలెట్స్ వంటి సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ కేంద్రాలో అవసరమైన బోర్డులు, రిజిస్టర్స్, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకోసం అవసరమయ్యే బాక్స్‌లు వంటివాటిని అధికారులు సిద్ధం చేశారు. కౌంటింగ్ టేబుల్స్, జాలీలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. వీటి పనులు మొదలు పెట్టారు. ఇప్పటికే హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్యలు.. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల ఏజెంట్లతో కలిసి ఏనుమాముల గోదాంలో లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూంలు సందర్శించి పరిశీలించారు. ఈవీఎంల భద్రత, కౌంటింగ్ ఏర్పాట్ల గురించి వారికి వివరించారు. అదేవిధంగా త్వరలో కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

మంగపేట: విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని హెచ్‌ఎం భాస్కర్‌రావు తెలిపారు. మండల పరిధిలోని రాజుపేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థినులకు కరాటే శిక్షణ కార్యక్రమాన్ని హెచ్‌ఎం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులపై తరుచుగా జరుగుతున్న దాడులను ఎదుర్కోవడానికి కరాటే నేర్చుకోవడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకుడు చందా హనుమంతరావు, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు గద్దం శ్రీనివాస్, జమున, రాజ్యలక్ష్మి, పావని, పద్మ, లావణ్య, మహాదేవి, సుజాత, స్రవంతి పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు

ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేముల శ్రీనివాస్



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేముల శ్రీనివాస్

ఏటూరునాగారం: అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం నిల్వ చేసి అమ్మకాలు జరిపితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ములుగు, భూపాలపల్లి ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేముల శ్రీనివాస్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటి నుంచి నమోదైన కేసుల వివరాలు, స్వాధీనం చేసుకున్న మద్యం వివరాలను ఆయన బుధవారం వెల్లడించారు. ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు 120 కేసుల్లో 52 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సుమారు 1,773 లీటర్ల మద్యం, 1,842 లీటర్ల బీర్లు, 1,900 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. సుమారు 70 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. మంగపేట మండల పరిధిలోని మల్లూరు, నర్సింహసాగర్ గ్రామాల్లో ఆకస్మికంగా దాడులు చేసి ఇద్దరిపై కేసులు పెట్టామని వివరించారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చారి, సీఐలు ఫకీరా, రాజ సమ్మయ్య, ఎస్సై వెంకన్న, చందు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్ష మేరకు పనిచేస్తా

- మీట్ ది ప్రెస్‌లో బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్


మాట్లాడుతున్న చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

నయీంనగర్: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించానని, ఈ ఎన్నికల్లో కూడా మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్ కోరారు. ఈమేరకు బుధవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో దాస్యం మాట్లాడుతూ కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజల అండదండలతో తాను 50వేల మెజారిటీతో విజయం సాధిస్తానన్నారు. గెలుపొందిన అనంతరం ప్రజల ఆకాంక్ష మేరకు పనిచేస్తానన్నారు. 30 ఏండ్ల రాజకీయ జీవితంలో అంచెలంచలుగా ఎదిగి ఈ స్థాయికి వచ్చానని, తన ప్రస్థానంలో మీడియా పాత్ర కీలకమన్నారు. జర్నలిస్టులు తెలంగాణ ఉద్యమంలో ఎంతో సహకరించారని, సకల జనుల సమైక్య ఫలితమే తెలంగాణ సాధ్యమైందన్నారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజల మధ్యలో ఉన్నానని, వినోదాలకు విదేశాలకు వెళ్లలేదన్నారు. కరోనా సమయంలో 46వేల కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశానని, డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ధరలు నియంత్రించానన్నారు. ప్రజలకు విద్య, వైద్యం అందించడంలో నిరంతరం కృషి చేసి ఆరోగ్య విషయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆదుకున్నామన్నారు.కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారి అవసరాలు తీర్చానన్నారు. పేద మృతుల కుటుంబాలను ఆదుకున్నామని, వారి శుభకార్యాల్లో సహాయం చేశామన్నారు. వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలతో ప్రజల భిన్నమైన సమస్యలను తెలుసుకొని పరిష్కరించానన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, టీయూడబ్ల్యూజే(143) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, టీయూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొక్క దయాసాగర్, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఓటు భద్రంగానే..!

- అక్రమాన్ని అడ్డుకునేందుకు 'చాలెంజ్ ఓటు'
- ఓటు గల్లంతైతే 'టెండర్ ఓటు' కు అవకాశం
- ఎన్నికల కమిషన్ వెసులుబాటు



వర్ధన్నపేట: సాధారణంగా వివిధ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటర్ స్లిప్, గుర్తింపు కార్డు చూపి ఓటు వేయడమే మనకు తెలుసు. కానీ ఓటు వేయంలోనూ చాలెంజ్, టెండర్ అనే రెండు రకాల ఓట్లు ఉంటాయి. అవేంటో ఒకసారి చూద్దాం..

చాలెంజ్ ఓటు

పోలింగ్ కేంద్రంలో అధికారులతో పాటు ఆయా పార్టీలు నియమించుకున్న పోలింగ్ ఏజెంట్లు ఉంటారు. ఒక ఓటరు వచ్చినప్పుడు సదరు ఓటరు నకిలీ అని ఏజెంట్ సందేహించినప్పుడు పోలింగ్ ఏజెంట్ చాలెంజ్ చేయడానికి వీలు కల్పించారు. ఓటరు సరైన వ్యక్తి కాదని ప్రిసైడింగ్ అధికారితో చాలెంజ్ చేసి రూ.5 రుసుం చెల్లించి చాలెంజ్ చేస్తాడు. దీంతో ప్రిసైడింగ్ అధికారి ఓటరుకు సంబంధించిన పత్రాలు అన్ని పరిశీలించి నిర్ధారణ చేసుకుని సరైన ఓటరుగా నిరూపణ అయితేనే ఓటు వేయడానికి అవకాశం కల్పిస్తారు. లేదంటే వెనక్కి పంపిస్తారు. కొన్ని సందర్భాల్లో ఓటరుకు బ్యాలెట్ అందించి దాని ద్వారా ఓటు వేయించి కవర్‌లో ఉంచి సీల్ చేస్తారు. ఓటరు సక్రమని తేలితే కౌంటింగ్ సమయంలో కవర్ ఓపెన్ చేసి దానిని లెక్కిస్తారు.

టెండర్ ఓటు..

పోలింగ్ రోజున తన ఓటు ఎవరో వేశారని ఓటరు గుర్తించిన పక్షంలో టెండర్ ఓటు వేస్తానని అధికారులను కోరవచ్చు. తన స్థానంలో ఇంకెవరో ఓటు వేశారని ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలి. అప్పుడు ఆ అధికారి విచారణ జరిపి గుర్తింపు నిర్ధారిస్తారు. అయినా ఓటు వేయడానికి అవకాశం కల్పించకుంటే టెండర్ ఓటు వేస్తానని ఓటరు డిమాండ్ చేయొచ్చు. రూ. 2 రుసుం చెల్లించి టెండర్ ఓటు సైతం బ్యాలెట్ ద్వారానే వేసుకోవాల్సి ఉంటుంది. ఓటరు వేసిన టెండర్ ఓటును సీల్డ్ కవర్‌లో భద్రపరుస్తారు. ఇలా ఎన్నికల కమిషన్.. ఓటరు చాలెంజ్, టెండర్ ఓట్లు వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది.

కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య ఘర్షణ

- కాంగ్రెస్ ఎంపీటీసీ భర్తకు గాయాలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య ఫోన్ కాల్ చిచ్చు పెట్టి ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ఎంపీటీసీ భర్త రేవెల్లి నాగరాజుపై బీజేపీ నాయకుడు శ్రీకాంత్ దాడికి పాల్పడడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఎస్సై లక్ష్మణ్‌రావు కథనం ప్రకారం నాగరాజు అల్లుడు బందెల వెంకటేష్ బుధవారం బీజేపీ నాయకుడు గోర శ్రీకాంత్‌కు ఫోన్ చేసి 'వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే, డిసెంబర్ 3న గెలిచేది మా ఎమ్మెల్యేనే' అని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో శ్రీకాంత్.. వెంకటేష్ ఫోన్‌కాల్ చేసి బెదిరిస్తున్నట్లు నాగరాజుకు వివరించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటమాటా పెరిగి నాగరాజుపై శ్రీకాంత్ మరి కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు హుటాహుటినా నాగరాజును మహదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. నాగరాజుకు కుడి చేయికి గాయమైంది. అనంతరం ఈ ఘర్షణ విషయంలో శ్రీకాంత్, నాగరాజు ఒకరిపై మరొకరు కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

దూషిస్తోన్నదని కడతేర్చాడు..

- వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ రఘుచందర్

జఫర్‌గఢ్ : మండలంలోని తీగారం గ్రామానికి చెందిన వృద్ధురాలు ముస్కు రామనర్సమ్మ(60)ను దారుణంగా హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ రఘుచందర్, సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తీగారం గ్రామానికి చెందిన సింగిరెడ్డి రవి ఈ నెల 20వ తేదీన రాత్రి ఒంటరిగా ఉంటున్న రామనర్సమ్మను ఇంటికి వెళ్లాడు. ఆమెతో మాట్లాడుతూనే తన వెంట తీసుకొచ్చిన కత్తితో గొంతు కోసి, పొట్టలో పొడవడంతో రామనర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు.. సింగిరెడ్డి రవి వృద్ధురాలిని హత్య చేసినట్లు గుర్తించారు. అనంతరం అదుపులోకి తీసుకుని విచారించగా కొద్ది రోజుల నుంచి రామనర్సమ్మ తనను ఇష్టం వచ్చినట్లు దూషిస్తోన్నదని, దీంతో ఆమెపై కక్ష పెంచుకుని ఎవ రూ లేని సమయంలో హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుడి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిపై ఇదివరకే 2004లో వరకట్నం కోసం రెండో భార్యను చంపిన కేసు నమోదై ఉన్నట్లు వారు పేర్కొన్నారు. కాగా, ఘటన జరిగిన 24 గంటల్లోనే పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేయడంపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

చుక్కల దుప్పి స్వాధీనం


దుప్పిని స్వాధీనం చేసుకుంటున్న అటవీ అధికారులు

పలిమెల: పలిమెల సెక్షన్ పరిధిలో గొర్రెలు, మేకల కాపరులకు దొరికిన చుక్కల దుప్పిని బుధవారం అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని అడవిలో వదిలిపెట్టారు. సెక్షన్ ఆఫీసర్ జలీమ్ షా కథనం ప్రకారం మూడు రోజుల క్రితం మహారాష్ట్రకు చెందిన గొర్రెల కాపరులు అడవిలో జీవాలను మేతకు తీసుకెళ్లిన సందర్భంలో తల్లి నుంచి వేరుగా ఉన్న దుప్పి.. గొర్రెల మందలో కలిసింది. దుప్పికి ఎలాంటి హాని చేయకుండా కాపరులు తమ వద్దే ఉంచుకున్నారు. బుధవారం గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా సెక్షన్ ఆఫీసర్ జలీమ్ షా తన బృందంతో కలిసి గొర్రెల కాపరుల వద్ద నుంచి దుప్పిని స్వాధీనం చేసుకుని అడవిలో వదిలేశారు. బీట్ ఆఫీసర్లు శ్రీనివాస్, రమేష్, విఠల్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యకు యత్నం

- కాపాడిన కానిస్టేబుల్ ● హసన్‌పర్తి చెరువు వద్ద ఘటన

హసన్‌పర్తి: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహితను కానిస్టేబుల్ రక్షించాడు. ఈ ఘటన బుధవారం హసన్‌పర్తి పెద్ద చెరువు వద్ద చోటు చేసుకుంది. నగరంలోని నయీంనగర్ ప్రాంతానికి చెందిన ఓ వివాహిత ఆర్థిక కారణాలతో భర్తతో గొడవ పడి హసన్‌పర్తి పెద్ద చెరువు వద్దకు చేరుకుంది. అయితే స్థానిక సీఐ గోపికి ఆ వివాహిత అనుమానాస్పదంగా సంచరిస్తుందనే సమాచారం అందింది. దీంతో సీఐ ఆదేశాల మేరకు కోర్టు కానిస్టేబుల్ రత్నాకర్ అక్కడికి చేరుకున్నారు. అప్పటికే వివాహిత చెరువులో దూకడానికి సిద్ధంకాగా కానిస్టేబుల్ రక్షించారు. వెంటనే కుటుంబీకులకు సమాచారం అందించారు. అనంతరం వివాహితకు కౌన్సెలింగ్ నిర్వహించి భర్తకు అప్పగించారు. వివాహితను రక్షించిన కానిస్టేబుల్ రత్నాకర్, తక్షణమే స్పందించిన సీఐ గోపిని సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు.

చదువు ఇష్టం లేక.. విద్యార్థిని ఆత్మహత్య

మల్హర్: చదువు ఇష్టం లేక ఓ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బుధవారం మల్హర్ మండలం కొండంపేటలో జరిగింది. గ్రామానికి చెందిన దివ్య(14) మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. కొంత కాలంగా చదువుకోవడం ఇష్టం లేక మనోవేదనకు గురయ్యేది. ఈ క్రమంలో చదువుపై ఇష్టం లేకపోవడం.. జీవితంపై అవగాహన లేమి కారణంగా దివ్య ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కొయ్యూరు ఎస్సై నరేష్ తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కుటుంబం.. కకావికలం

వరంగల్ నగరంలో జోరుగా పేకాట..

- విస్తరిస్తున్న విష సంస్కృతి
- శిథిల ఇళ్లు, నిర్జన ప్రదేశాలే స్థావరాలు
- పట్టుబడినా మారని పేకాట రాయుళ్లు
- రోడ్డున పడుతున్న పేద, మధ్యతరగతి బతుకులు



ఖిలా వరంగల్: వరంగల్ నగరంలో పేకాట శిబిరాలు జోరుగా కొనసాగుతున్నాయి. శిథిలావస్థలోని ఇళ్లు, వాహనాల పార్కింగ్ స్థలాలు, నిర్జీవ ప్రదేశాలు, ముళ్ల పొదలే అడ్డాలుగా ఏర్పాటు చేసుకుని పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా పేకాట మోజులో పడిలో ఎంతో మంది తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. అప్పుల్లో కూరుకుపోయి కుటుంబ సభ్యులకు దూరమై బతుకుతున్నారు. మరికొందరు ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసై చిన్న వయసులోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఫలితంగా పలు కుటుంబాలు ఇంటి పెద్దలు, పిల్లలను కోల్పోయి కకావికలమవుతున్నాయి. అయితే నిర్వాహకులు మాత్రం లక్షల సంపాదిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతంలో పేకాటకు ప్రత్యేక క్లబ్‌లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గతంలో పేకాటకు ప్రత్యేక క్లబ్‌లు ఉండేవి. కానీ వాటివల్ల జరుగుతున్న నష్టాన్ని భరించలేని పలువురు మహిళలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో క్లబ్‌ల్లో పేకాటను పూర్తిగా నిషేధించారు. కానీ ఈ ఆట ద్వారా వస్తున్న ఆదాయాన్ని వదులుకోలేని కొందరు నిర్వాహకులు నివాసాలనే అడ్డాలుగా మార్చారు. అయితే ఎన్నికల వేళ అధికారుల కళ్లు గప్పి వేరే చోట పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది.

బలవుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు

పేకాటకు ఎక్కువగా పేద, మధ్య తరగతి ప్రజలే బానిసవుతున్నారు. స్థావరం ఎక్కడ కొనసాగుతున్నాయో రహస్యంగా తెలుసుకుని అక్కడి వెళ్లి పేకాడుతూ ఇల్లు గుల్ల చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.వేయితో మొదలైన జూదం.. రూ. లక్షల్లో సాగుతుంది. దీనికి యువత కూడా ఆకర్షితులవుతోంది. ఆటలో ఆస్తి మొత్తం పోగొట్టుకున్నాకా అప్పు లభించకపోతే ఇంట్లో ఉన్న బంగారం తాకట్టు పెట్టి పేకాటకు వెళ్తున్నారని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే పేకాట నిర్వాహకులు మాత్రం ఇదొ లాభసాటి వ్యాపారంగా మార్చుకున్నారు. పైసా పెట్టుబడి లేకుండా సులువుగా నెలకు లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారని సమాచారం.

సకల భోగాలు

పేకాడే సమయంలో ఇళ్లే కదా.. అని అనుకుంటే పొరపాటే. పేకాట రాయుళ్లకు సకల భోగాలు సమకూర్చే స్వర్గం అంటే సరిపోతుంది. మందు, విందు ఏది కావాలన్నా క్షణాల్లో సమకూరుతోంది. పేకాట రాయుళ్ల బలహీనతలను ఆసరా చేసుకుంటున్నా నిర్వాహకులు వారికి కావాల్సిన డబ్బును రూ.5 నుంచి రూ.10 వడ్డీకి అందజేస్తున్నట్లు తెలుస్తోంది.

రోడ్డున పడుతున్న కుటుంబాలు..

పేకాట అడుతున్న వారిలో ఉన్నత వర్గాలతోపాటు పేద,మధ్య తరగతి వారు కూడా ఉంటున్నారు. ఒక్కొక్కరు సరాసరి రూ.5వేల నుంచి ప్రారంభమై రూ.లక్ష వరకు పోగొట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. చేతిలో డబ్బు లేకపోవడంతో పూర్వికులు కష్టపడి సంపాదించిన స్థిర ఆస్తులన్నీ అమ్ముకుటంటున్నారు. ఫలితంగా చివరకు ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ అవమానాలు తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పేకాటపై ఉక్కుపాదం మోపాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

- కొందరు పేకాటరాయుళ్లు వరంగల్ తెలంగాణ జంక్షన్ సమీపంలోని డీసీఎం వాహనాల పార్కింగ్ స్థలాన్ని పేకాట అడ్డాగా మార్చేశారు. దీంతో డ్రైవర్లు ఆకర్షితులై నిత్యం పేకాట ఆడుతున్నారు. ఈ ఆటపై టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్‌కు సమాచారం అందడంతో ఆయన ఆదేశాల మేరకు సీఐ దేవేందర్ ఈ నెల 20వ తేదీన పేకాట స్థావరంపై దాడి చేశారు. కాగా, ఇదే నెలల్లో రెండు సార్లు డ్రైవర్లను పదుల సంఖ్యలో పట్టుకుని వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.
- ఖిలా వరంగల్ తూర్పుకోట, పడమరకోటలో శిథిల ఇళ్లు, నిర్జీవ ప్రదేశాల్లో పేకాట ఆడుతున్నారని టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందింది. అక్టోబర్, నవంబర్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారులు వేర్వేరు దాడులు జరిపి పలువురిని అదుపులోకి తీసుకుని రూ.వేలల్లో నగదు, సెల్‌ఫోన్లు, బైక్‌లు స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేశారు.

ఎన్నికల వేళ.. పేకాట కట్టడి

నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో పేకాట శిబిరాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే గంజాయి, మద్యంతోపాటు పేకాట స్థావరాలపై నిఘా పెట్టారు. ఎక్కడికక్కడ నిత్యం దాడులు చేసి పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి వేలల్లో డబ్బులు స్వాధీన పర్చుకుంటున్నారు. అయినా పేకాటరాయుళ్లు, నిర్వాహకులు తీరు మారడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


పేకాడుతూ పట్టుబడిన డీసీఎం డ్రైవర్ల అరెస్టు చూపుతున్న ఇన్‌స్పెక్టర్ దేవేందర్ (ఫైల్)

సమ్మెకు రైల్వే కార్మికులు సై

- సమ్మె బ్యాలెట్‌లో ఓటింగ్ తీర్పు



కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ పరిధిలో వివిధ రైల్వే కార్యాలయాల్లో సోమ, మంగళవారాల్లో రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మె బ్యాలెట్‌లో కార్మికులంతా సమ్మె చేయాలని ఓటింగ్‌లో ద్వారా తీర్పు ఇచ్చారని రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సీడబ్ల్యూసీ మెంబర్ చింత మురళి బుధవారం తెలిపారు. సమ్మె బ్యాలెట్‌లో కాజీపేట డీజిల్ లోకో షెడ్‌లో 525, ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో 370, లోకో రన్నింగ్ కార్యాలయంలో 428, హెడ్ క్వార్టర్స్‌లో 376, ఇంజనీరింగ్ విభాగంలో 370, క్యారియజ్ అండ్ వ్యాగన్, సిగ్నల్ అండ్ టెలి కమ్యూనికేషన్ ఎలక్ట్రిక్, మెడికల్ విభాగంలో 181 మంది రైల్వే కార్మికులు పాత పెన్షన్ విధానమే కావాలని కోరుతూ సమ్మె కావాలని మొత్తం 2,250 మంది కార్మికులు మద్దతు ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

మజ్దూర్ యూనియన్ సమ్మె బ్యాలెట్ ముగింపు

కాజీపేట రైల్వే స్టేషన్‌లో, రైల్వే డ్రైవర్ల కార్యాలయం, డీజిల్ లోకో షెడ్, ఎలక్ట్రిక్ లోకోషెడ్, ఘన్‌పూర్ స్టేషన్, కాజీపేట సెంట్రల్ కార్యాలయం, టీటీ మిషన్ కార్యాలయంలో మంగళ, బుధవారం రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మె బ్యాలెట్‌లో దాదాపు రైల్వే కార్మికులందరు పాత పెన్షన్ విధానమే కావాలని ఓటింగ్ తీర్పు ద్వారా తెలిపారని రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ చైర్మన్ పాక వేదప్రకాష్ తెలిపారు.

ఐఈఎస్‌లో అభిషేక్‌కు 42వ ర్యాంకు


వేముగంటి అభిషేక్

స్టేషన్‌ఘన్‌పూర్ : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఐఈఎస్(ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్)లో మండలంలోని శివునిపల్లికి చెందిన వేముగంటి రాంప్రసాద్, శ్రీదేవిల కుమారుడు అభిషేక్ ఆల్ ఇండియా 42వ ర్యాంకు సాధించాడు. ఐఈఎస్ ఫైనల్ రిజల్ట్స్ బుధవారం వెలువడ్డాయి. అభిషేక్ పదో తరగతి వరకు స్థానిక సెయింట్ థామస్ హైస్కూల్‌లో, ఇంటర్ హైదరాబాద్ ఘట్‌కేసర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో, బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ నాగపూర్‌లోని నిట్‌లో చదివాడు. కాగా, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అభిషేక్‌కు అభినందలు తెలిపారు.

సంతోషంగా ఉంది: అభిషేక్

ఐఈఎస్‌లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు (42వ) రావడం చాలా సంతోషంగా ఉంది. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి నన్ను చదివించారు. తమ్ముడు, స్నేహితుల ప్రోత్సాహంతో కష్టపడి చదివా. సమాజంలో ఉత్తమ ఉద్యోగిగా సేవలు అందిస్తా.

'నల్లింకు పెన్ను' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో పాల్గొన్న వేణుగోపాల్, రమేశ్ తదితరులు

కేయూ క్యాంపస్ : సమాజ గమనంతో కవిత్వం ముడిపడి ఉండాలని వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఎమ్మెస్సీ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విభాగం విద్యార్థి సభావత్ హాథిరామ్ రచించిన 'నల్లింకు పెన్ను' అనే పుస్తకాన్ని బుధవారం కెమిస్ట్రీ సెమినార్ హాల్‌లో వీసీ ఆచార్య తాటికొండ రమేశ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కవిత్వం అక్షరాల భాష కాదు..పద చిత్రాల భాష అని ప్రతీ ఒక్కరు కూడా కవిత్వం రాయగలరన్నారు. డిజిటల్ యుగంలోనూ రచనలు చేయడం అభినందనీయమన్నారు. యువత నూతన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ మాట్లాడుతూ.. ధైర్యం, సాహసం, నిర్భయత్వం యువత బలాలు కావాలన్నారు. రచనల ద్వారా సమాజ రుగ్మతలను ఎత్తిచూపాలన్నారు. కంప్యూటర్ బంధం కాదని మానవ బంధం అవసరం అన్నారు. నల్లింకు పెన్ను పుస్తకంలో రచయిత సమాజాన్ని ప్రతిబింబించే విధంగా తన కవితా హృదయాన్ని ఆవిష్కరించారని తెలిపారు. సమాజాన్ని విస్మరించే పరిశోధన అర్థరహితమన్నారు. సైన్స్ సమాజానికి సన్నిహిత సంబంధం ఉందన్నారు. కార్యక్రమంలో కాళోజీ ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి టి.నాగరాజు, అమృత్‌రాజు శోభ, రమేశ్, భూక్యా ప్రవీణ్, కెమిస్ట్రీ విభాగం అధిపతి ఆచార్య సవితాజ్యోత్స్న, కేయూ అభివృద్ధి అధికారి ఆచార్య వాసుదేవరెడ్డి, రచయిత హాథిరామ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్‌కు పది రోజులు సెలవు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 25 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు సెలవు ఉంటుందని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి బీవీ రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న వారాంతపు యార్డు బంద్, 26 ఆదివారం, 27న కార్తీక పౌర్ణమి, గురునానక్ జయంతి సెలవు, 28వ తేదీ నుంచి 4వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఎన్నికల సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు యార్డులు బంద్ ఉంటాయని పేర్కొన్నారు. ఈ పది రోజులు మార్కెట్‌లో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవన్నారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు గమనించాలని కోరారు.

అంతా కుమ్మక్కయ్యారు


క్వారీగా మారిన గుట్ట

హసన్‌పర్తి : మొరం అక్రమ దందాలో అన్ని శాఖల ప్రమేయం ఉన్నట్లు స్పష్టమవుతోంది. మండలంలోని సిద్ధాపురం-హరిశ్చంద్రనాయక్ తండాల మధ్యలో ఉన్న గుట్ట నుంచి కొంతమంది అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. కాగా, హరిశ్చంద్రనాయక్ తండా ఉపసర్పంచ్‌రాజు దీనిపై అభ్యంతరం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా గుట్ట నుంచి భారీగా మొరం దందా సాగుతోందని మైనింగ్‌తో పాటు ఇతర శాఖల అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా గుట్టను తవ్వుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. రెవెన్యూ, పోలీస్‌శాఖలకు సమాచారం అందించిన అధికారులు స్పందించలేదు. ఫలానా వ్యక్తి ఫిర్యాదు చేశాడని అక్రమార్కులకు సమాచారం అందించారు. దీంతో ఆగ్రహానికి గురైన అక్రమార్కులు ఉపసర్పంచ్‌పై మంగళవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. ఇదిలా ఉండగా, ఉపసర్పంచ్ ఫిర్యాదుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకున్నట్లయితే ఘటన జరిగి ఉండేది కాదని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ విషయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కాకతీయుల చరిత్ర తెలుసుకోవాలి

- అసిస్టెంట్ ప్రొఫెసర్ రామిరెడ్డి, కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేశం


పోటీలకు హాజరైన విద్యార్థులు, ప్రొఫెసర్ రామిరెడ్డి, జిల్లా అధికారి మల్లేశం

ఖిలా వరంగల్: విద్యార్థి దశ నుంచే చారిత్రక కట్టడాలను పరిరక్షిస్తూ, కాకతీయల చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. రామిరెడ్డి, కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి మడిపల్లి మల్లేశం అన్నారు. పురావస్తుశాఖ ఆదీక్షకురాలు స్మిత ఎస్ కుమారీ ఆదేశాల మేరకు ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా బుధవారం చారిత్రక ఖిలా వరంగల్ మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో పలు పాఠశాలల విద్యార్థులకు కాకతీయుల విశిష్టత, ప్రజా రంజకపాలనపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పూర్వీకులు మనకు అందజేసిన విలువైన శిల్ప కళా సంపదను కాపాడుతూ భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు జరిగాయి. కార్యక్రమంలో శ్రీకాంత్, టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టి కొప్పుల అజయ్, పలు ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.